**Shikshan Sanshodhan : Journal of Arts, Humanities and Social Sciences** ISSN(o): 2581-6241
Monthly, Peer-Reviewed, Refereed, Indexed Journal Impact Factor: 6.471
Volume - 6, Issue - 6, June - 2023 Publication Date: 10/06/2023

DOIs:10.2018/SS/202306001 --:-- Research Paper / Article / Review

# కవనశర్మ 'సంచార పరిశోధనాలయం' కథ – విశ్లేషణ

**డాక్టర్ జె. వెంకటరమణ**
అసోసియేట్ ప్రొఫెసర్ మరియు హెడ్,
తెలుగు విభాగం, భారతీయ భాషల పాఠశాల
మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం, మధురై, తమిళనాడు - 625021
Email: venkataramana.telugu@mkuniversity.ac.in

***సారాంశం:*** కవనశర్మ రచించిన సంచార పరిశోధనాలయం కథలో విద్యావ్యవస్థలో చోటు చేసుకున్న పరిస్థితులను ప్రత్యేకించి ఇంజనీరింగు విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులు, అందులోని మంచి విషయాలను, లోపాలను కూలంకుషంగా చర్చించిన కథ. ఇందులో అధ్యాపకులు నిరుద్యోగ సమస్యకు కారణాలను, దానికి పరిష్కార మార్గాలను సూచించిన కథగా దీనిని పేర్కొనవచ్చు. ఈ కథలో రచయిత సహజత్వంతో కూడిన విషయాలను తెలియజేస్తూనే, వ్యంగ్య ధోరణితో విద్యావ్యవస్థలో నెలకొన్న చిక్కుముడులను, స్థితిగతులను వివరిస్తూ, కథను నడిపించిన తీరు ఎంతో ఆహ్లాదకరంగానూ, ఆలోచనాత్మకంగానూ, ఆచరణీయాత్మకంగానూ కనిపిస్తుంది. ఐదు దశాబ్దాల అనంతరం కూడా కొత్తగా వచ్చిన కథలా అనిపిస్తుంది. దీనికి కారణం విద్యావ్యవస్థలోని పరిణామాలేనని చెప్పడం అతిశయోక్తి కాదు.

***ముఖ్య పదాలు:*** కవనశర్మ, కథ, సంచార, పరిశోధనాలయం, ఇంజనీరింగు విద్యావ్యవస్థ.

## పరిచయ:

కవనశర్మగా ప్రసిద్ధి చెందిన కందుల వరాహ నరసింహ శర్మ సెప్టెంబర్ ౨౩, ౧౯౩౯న జన్మించారు. ఆయన స్వస్థలం విశాఖపట్నం. కవనశర్మవృత్తిరీత్యా సివిల్ ఇంజనీరింగ్ ఆచార్యుడు. అందులో జలవనరులు ఆయన ప్రత్యేకత. కవనశర్మ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగుళూరులో ఆచార్యులుగా పనిచేశారు. అలాగే ఉపన్యాసకులుగా ఆయన చాల దేశాలు సందర్శించారు. కవనశర్మ ఎక్కువగా విశాఖపట్నం, బెంగుళూరులలో ఉండేవారు. తెలుగులో మంచి కథకుడిగా, వ్యాసకర్తగా కవనశర్మ పేరు సంపాదించుకున్నారు. రచన (మాసపత్రిక)కి సలహాదారులలో ఆయన కూడా ఒకరుగా వ్యవహరించారు. ఆయన రచనలలో కవనశర్మ కథలు, సైన్సు నడచిన బాట, వ్యంగ్య కవనాలు, పరిధి అనేవి గొప్ప రచనలుగా ప్రసిద్ధి చెందాయి. వ్యంగ్య కవనాలు అనేది పేరులోనే తెలిపినట్లుగా వ్యంగ్య భరితమైన కథల సంపుటి. పరిధి అనేది ఉమ్మడి కుటుంబము యొక్క పరిమితులను, కష్ట నష్టాలను, మంచి చెడులను గురించి విశ్లేషిస్తుంది.

కవనశర్మ శ్రీకాకుళంలో కారా మాస్టారు ఏర్పరచిన కథా నిలయానికి సలహాదారుగా కూడా ఉండేవారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ౨౦౧౮ అక్టోబరు ౨౫న మరణించాడు.

## 'సంచార పరిశోధనాలయం' కథ – నేపథ్యం:

ఈ కథ కవనశర్మ రచించిన 'వ్యంగ్య కవనాలు' అనే కథా సంపుటి లోనిది. ఇందులో మొత్తం 18 కథలు ఉన్నాయి. ఈ కథ 08-10-1982 నాటి ఆంధ్రపత్రిక వార పత్రికలో ప్రచురితమైనది. కవనశర్మ ఈ కథను రాయడానికి గల నేపథ్యాన్ని గురించి చెబుతూ, కథకు ఉపోద్ఘాతాన్ని రాయడం ఈ కథలోని విశేషం. కథాంశాన్ని గురించి, దానిలో గ్రహించిన వస్తువును గురించి రచయిత ఈ ఉపోద్ఘాతంలో ముందుగానే మనకు సూచిస్తారు. అలాగే ఈ కథా వస్తువును ఎంచుకోవడంలో దోహదం చేసిన ఆలోచనలను కలిగించినందుకు కవనశర్మ, *ఈ విషయం నాదృష్టికి తెచ్చిన ఆంధ్రా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకి జమిలిగాను, సహాధ్యాయుడు వారణాసి సీతారామ్ కి ప్రత్యేకంగాను నా కృతజ్ఞత. శతకోటి దరిద్రాలకి అనంత కోటి ఉపాయాలుంటాయిట. ఈ పరిశోధనాలయం సీతారామ్ సూచించిన అటువంటి ఉపాయం* అని తన కృతజ్ఞతను తెలియజేశారు.

**వస్తువు:**

సుమారు నలభై ఏళ్ల క్రితం రాసిన ఈ కథలోని వస్తువు ఈనాటి ఆధునిక సమాజంలో కూడా మన కళ్ళముందు సజీవంగా శాఖోపశాఖలుగా విస్తరించుకొని నిలిచి ఉండటం ఎంతో విస్మయానికి గురిచేస్తుంది. నలభై ఏళ్ల క్రితమే రచయిత రాబోయే కాలంలో విద్యావ్యవస్థలోని డొల్లతనాన్ని, వ్యాపార దృక్పథాన్ని, ప్రపంచీకరణ ధోరణిని మన కళ్ళముందు ఉంచుతారు. ఈనాడు మనం చూస్తున్న వీధి వీధికి, గల్లీ గల్లీకి విస్తరించి ఉన్న నాణ్యత లోపించిన ఇంజనీరింగ్ కాలేజీల డాంబికత్వం గురించి, వాటిలోని సౌకర్యాల లేమిని గురించి కవనశర్మ ఈ కథలోని ఉపోద్ఘాతంలో ఈ విధంగా ప్రస్తావించారు.

*"ఊరుకో ఇంజినీరింగ్ కాలేజీ ఉద్భవిస్తోంది. కొన్ని ఊర్లలో ఒకటి పెడ్తే సంతృప్తి పడి ఊరుకోక రెండు మూడు పెట్టించుకొంటున్నారు. ఆ మధ్య తీసిన లెక్కల ప్రకారం ఏడాదికి 16,500 మంది బి.య్యీలు, 2700 మంది ఎమ్. ఇలు, 150 మంది డాక్టరేట్లు మన దేశంలో తయారవుతున్నారు. 140 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి బయటపడ్తున్నారు. గత రెండు సంవత్సరాలతో తెలుగు నాట కొత్త కాలేజీలు పది వెలిసాయి. కర్నాటక మరికొన్ని వెలిసాయి. దేశంలో ఉన్న "ఇంజినీరింగ్ మేస్టర్లు" కొందరు కొత్త కాలేజీలోసర్దుకొన్నారు కొత్త కాలేజీలో ఖాళీలు నిండలేదు గాని పాత కాలేజీల్లో ఖాళీ లేర్పడ్డాయి. కాలేజీలు పుట్టుకువచ్చినంతవేగంగా దేశంలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ పెరగలేదు. ప్రయోగశాలలకి కావలసిన పరికరాలుపనిముట్లు తయారుచేసే కంపెనీలు కొద్దే ఉండి "బెక్" చూపిస్తున్నాయి. ఒకటి కద్రువ సంతానంలాగా బిల బిలా పుట్టుకువస్తుంటే రెండవ వర్గం వినత సంతానం లాగా తాపీగా వాటి బైమునితీసుకొంటున్నాయి."*

1980వ దశకంలో దేశంలోకి పుట్టగొడుగుల మాదిరిగా వెల్లువెత్తిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నేపథ్యాన్ని గురించి పైన పేర్కొన్న ఉపోద్ఘాతం వెల్లడిస్తున్నది. అదే సమయంలో ఇంజనీరింగ్ మేష్టర్లకు పుట్టుకొచ్చిన అనూహ్యమైన డిమాండును కూడా ఈ వాక్యాలు తేటతెల్లం చేస్తున్నాయి. కాలేజీలు స్థాపించడంతోనే తమ పని అయిపోయిందని, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు ఏవీ కల్పించకుండానే కావలసినంత మేరకు డబ్బును దండుకోవడం మీదనే దృష్టి పెట్టే యాజమాన్యాలు, విద్యార్థుల అగచాట్లు మొదలైనవన్నీ ఈ కథకు దినుసులని కవనశర్మ ఈ ఉపోద్ఘాతం ద్వారా ముందుగానే మనకు సూచించారు.

**పాత్రలు:**

ఈ కథలో మనకు కనిపించే ముఖ్య పాత్రలు సిద్ధయ్య, అతని కుమార్తె మణి, ఆమె భర్త గోపాలరావు. అలాగే ఇంజనీరింగ్ కాలేజీని చూడటానికి వెళ్ళే ముందు సిద్ధయ్య వెంట వచ్చిన అతని స్నేహితుడు సుబ్బయ్య, తాటిపాకల ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాలు, అలాగే ఆ కాలేజీ యజమాని అయిన రామకృష్ణ రాజు, ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి మొదలైన పాత్రలు మనకు కనిపిస్తాయి.

**కథా సంవిధానం:**

ధనవంతుడైన సిద్ధయ్యతన కూతురి మాటల ద్వారా అల్లుడుకి తన ఊరు నచ్చలేదని విని, ఆ విషయం నిజమేనని ఒప్పుకుంటాడు. ఎందుకంటే చాలా కాలంగా తన ఊరి పరిసరాల్లో నాగరిక చిహ్నాలైన ఎటువంటి మార్పులూ రాలేదని సిద్ధయ్య భావిస్తాడు.

*"అల్లుడికి వూర్నచ్చ లేదంటే తప్పేటుంది? మనూళ్లో నచ్చడానికేటుంది? ఓ మెడికల్ కాలేజీనా! ఓ ఇంజినీరింగ్ కాలేజీనా! ఇయ్యేయియీ లేకుండా మంచి ఓటల్స్, సినిమా ఆళ్ళుఎట్టావస్తాయి? అవిలేనూరునచ్చమంటేఎట్టానచ్చుద్దే!" అన్నాడు సిద్ధయ్య.*

అయితే నిశితంగా గమనిస్తే సిద్ధయ్య తన ఊరు గురించి తన కూతురితో పలికిన మాటల్లో నిస్పృహకంటే, ఊరిలో ఏదో గుర్తించదగిన మార్పును తీసుకురావాలనే అతని ఆకాంక్ష, అలాగే ఆ విషయంలో స్వయంగా తానే పూనుకొని ఏదో ఒకటి చెయ్యాలన్న తపనే కన్పిపిస్తుంది. ఈ ఉద్దేశ్యాన్నే రచయితా కూడా తన ఉద్దేశ్యంగా పేర్కొన్నాడు. అంతేకాకుండా నాగరికతా సూచికలైన కాలేజీలు, హొటల్లు, సినిమా హాళ్లు రావాలంటే ఆషామాషీ విషయం కాదని సిద్ధయ్య అభిప్రాయం. అందుకే అతడు తన అల్లుడు గోపాలరావుతో ఇలా అంటాడు.

*"... అయ్యి ఆటంతటవి ఎక్కడ పడితే అక్కడ మొలుచుకొస్తాయేటి? ఆటికిసరైన కండిసన్సుండాలి. ఆటి కోసం తపించే జనం ఉండాలి. అప్పుడయ్యే ఏర్పడ్తాయి" అన్నాడుసిద్ధయ్య.*

సిద్ధయ్య తాను కూడా సొంత ఊరిలో ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీని పెట్టి, దాని ద్వారా లాభాలు ఆర్జించాలని భావిస్తాడు. అయితే ఊరికో కాలేజీ పెడితే ప్రభుత్వం దివాళా తీస్తుందని గోపాలరావు తన మామ సిద్ధయ్యతో అంటాడు. కానీ సిద్ధయ్య ఉద్దేశ్యంలో ఊరికో కాలేజీ పెట్టడం అంటే ప్రభుత్వ కాలేజీలు పెట్టడమని

కాదు. ప్రజలే పెట్టుకునేవి అని అర్థం. అంటే ప్రైవేటు కాలేజీలు అని సిద్ధయ్య ఉద్దేశ్యం. ఆ విషయాన్నే స్పష్టం చేస్తూ,

*"లేకపోతే మానేసినట్టు, మధ్దెలో భస్ ఆళ్లనెవళ్లెట్టమన్నా రోయ్. జనమే స్థాపించుకొంటారడ్డు తగలకుండా ఉంటే. బోడెమ్మ చేసే సాయం ఏటంటే ఎదుర్రాకుండటమేఅనిశాత్రం."*

అని సిద్ధయ్య అతని మనసులోని మాటను గోపాలరావుకి చెబుతాడు. జనం పెట్టుకునే కాలేజీలు అంటే ప్రైవేటు కాలేజీలు అని సిద్ధయ్య భావనగా ఇక్కడ తెలుస్తున్నది. అయితే అటువంటి కాలేజీలు పెట్టుకోవడానికి కూడా ప్రభుత్వం రకరకాల నిబంధనలతో అడ్డంకులు కల్పించడం మాత్రం అతడికి సుతారమూ ఇష్టం లేదని అతని మాటల వల్ల తెలుస్తున్నది.

కాలేజీల విషయంలో సిద్ధయ్య అభిప్రాయం వినగానే అతని మాటలకు గోపాలరావు అడ్డు తగులుతూ, జనం పెట్టే కాలేజీలంటే డొనేషన్ కాలేజీలని, విద్యని అమ్ముకునే అటువంటి కాలేజీల పట్ల అతనికి సదభిప్రాయం లేదని అంటాడు. ఈ సందర్భంగా డొనేషన్ గురించి సిద్ధయ్య చెప్పిన వ్యాఖ్యానం విపరీతార్థంతో ఉన్నప్పటికీ ఎంతో కొత్తగానూ, గమత్తుగా అనిపిస్తుంది.

*"ఈ రోజుల్లో యిద్యనమ్మని కాలేజీయాడుంది? ఎంత కమ్ముతోందన్న దాంటోనే తేడాలు. డొనేసన్ డొనేషన్ అంటూ ఆట్ని తీసి పారెయ్యకు! నేసన్ అన్నమాట డొ - నేసస్ అన్ని మాటలో దాక్కునుంది. దాన్ని డొ-నేసన్ అన్రాదుట. డు - నేషన్ ఆనాలట. డి ఓ...డు ... అంటే చెయ్యి అని అర్థం. డు - నేషన్ అంటే దేశాన్ని చెయ్యి అని అర్థం. దేశాన్నేటి చెయ్యాలి? బాగుచెయ్యాలి. దేశాన్ని బాగు చెయ్యడం కోసవెట్టిందే డొనేషన్! ఏట్రాడంగై పోయావా! ఇదంతా మన స్వంతం కాదు. ఆ మద్దెడొనేసన్ల మీద దుమారంలేస్తే ఓ బాగా సదువ్వుకున్నాయన ఆటిని సమర్థిస్తూ ఈ ముక్క ల్జెప్పాడు. ఆయన ఎటువంటి ఎదవపనినైనా కూడా తన తెలివితేటల్తో సమర్థించగలడట" అన్నాడు సిద్ధయ్య పకపకా నవ్వుతూ.*

నిజానికి ఇక్కడ సిద్ధయ్య పలికిన మాటల్లో కొంతైనా వాస్తవం లేకపోలేదు. ఆధునిక సమాజంలో ఈనాడు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదవడం కంటే, డొనేషన్ కట్టి ప్రైవేటు విద్యాసంస్థలలో చదివితేనే తమకు గౌరవం అని భావిస్తున్నారు. దానిని తమ సామాజిక హోదాగా కూడా భావించడం ఎంతో విచారకరం. అంతేకాకుండా ఈనాడు తల్లిదండ్రులలో కలిగిన ఇటువంటి విపరీత పోకడలు సిద్ధయ్య వంటి పెట్టుబడి దారులకు బంగారు బాతులుగా మారినవని చెప్పవచ్చు.

ఇదంతా ఒక ఎత్తు అయితే ఆ తర్వాత సిద్ధయ్య గోపాలరావుతో పలికిన మాటలు మరీ విపరీతంగా తోస్తాయి. గోపాలరావు తన మామ సిద్ధయ్యతో, ఈ ఊళ్లో కూడా డొనేషన్ కాలేజీ పెట్టడానికి ఎవరైనా ముందుకొస్తున్నారా? అని ప్రశ్నించాడు. అందుకు సిద్ధయ్య చెప్పిన సమాధానం మనల్ని ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తుంది. నలభై ఏళ్ల క్రితమే సమాజంలో ఇటువంటి విపరీతపు పోకడలు ఉండేవి అనే విషయం కొంత విస్మయానికి కూడా గురిచేస్తుంది.

*"మన కులపోళ్లకింకా ఓ కాలేజీఅంటూ ఏర్పడలేదు కదా! అందుకని మనోళ్లే ఎడ్డారి అనుకుంటున్నారు."*

అని సిద్ధయ్య పలికిన మాటలు ఎంతగానో ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. అందువల్లనే సిద్ధయ్య మాటలు వినగానే గోపాలరావు ఆశ్చర్యంతో విస్మయానికి గురైనాడు. అందుకే తన మామతో, డొనేషన్ కాలేజీలు అవటమే కాకుండా కులానికి ఒకటి కూడానా! అన్నాడు. అంతేకాకుండా అందరూ కలిసి చదువుకునే కాలేజీలు కూడా కులాల మీద ఆధారపడి పెట్టడం అసహ్యం కదూ అనిగోపాలరావు తన మామతో అన్నాడు. నలుపు తెలుపు అన్న కులాలు ఉన్నందుకు అమెరికాలో ఎంత గొడవ జరుగుతున్నది. రంగును బట్టి కులాలుగా ఏర్పడటాన్ని భారతదేశం ఎంత తీవ్రంగా నిరసిస్తోంది. అటువంటిది భారతదేశంలోనా ఇటువంటి అప్రదిష్ట పని జరగటం అని గోపాలరావు ఎంతగానో విచారించాడు. కానీ గోపాలరావు ఆధునిక సంస్కార భావాలను సిద్ధయ్య మరో విధంగా అర్థం చేసుకున్నాడు. గోపాలరావుది కేవలం అమాయకత్వమని, ఈ దేశంలో ప్రతిదానికి కులంతో సంబంధం ఉందని అతడు ప్రబోధించాడు.

*"... పెతీదానికి కులాలకి సంబంధం ఉంది. పెబుత్వాలు కులాల బలంమీద నిలబడ్తాయి. కులాల సపోర్టు లేక కూలిపోతాయి. పదవుల పంపిణీ జరిగేది కులాల వారీగానే కదా! ఆఖరికి రాజ్యాంగంలో కూడా స్పెసల్ గా కులాల గురించి ఓ ముక్క చెప్పారు. ఆ కులాల్నే ఎస్సీలన్నారుట. అధ్దూసి మా మాశేటి అంటూ బేరాలెట్టిన కులాల్ని బిసిలన్నారుట. ఈ ముక్క తెలివైన ప్రొపెసరే చెప్పాడు. అంధ్దేత మనదేశం చల్లగా ఉండాలంటే కులాల ఊస్తప్పదురా గోపన్నా !"*

సిద్ధయ్య మాటల్లో ఎంతో లోతైన రాజకీయ, సామాజిక విశ్లేషణ కనిపిస్తుంది. ఇక్కడ ప్రతి విషయం కులంతో ముడిపడి ఉందని ఈ సన్నివేశం లోని సంభాషణ మనకు తెలియజేస్తుంది. దేశంలోని రాజకీయాలు, ఎన్నికలు,

**Shikshan Sanshodhan : Journal of Arts, Humanities and Social Sciences** ISSN(o): 2581-6241
Monthly, Peer-Reviewed, Refereed, Indexed Journal Impact Factor: 6.471
Volume - 6, Issue - 6, June - 2023 Publication Date: 10/06/2023

పదవులు,అలాగే రాజ్యాంగం మొదలుకొని కాలేజీ చదువుల వరకు కూడా ప్రతిదాని వెనుక కులం ఉండనే నగ్నసత్యం ఇక్కడ కనిపిస్తున్నది.

ఇక ప్రైవేటు ఇంజనీరింగు కాలేజీ పెట్టడానికే సిద్ధయ్య మొగ్గు చూపుతాడు. అందుకుగాను చదువుకున్నవాడు, సైంటిస్టు, స్వయానా తన అల్లుడు అయిన గోపాలరావును తన వెంట తీసుకువెళ్లి, కొత్తగా తమ గ్రామానికి 20 మైళ్ల దూరంలో ఉన్న గ్రామంలో పెట్టిన ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీని చూసి రావాలని భావిస్తాడు. వారి వెంట సిద్ధయ్య కుమార్తె మణి, అతని స్నేహితుడు సుబ్బయ్య కూడా వస్తారు. అక్కడికి వాళ్లు చేరుకునే సరికి, ఆ పరిసరాలలో వారికి కాలేజీ ఆనవాళ్లు ఏవీ కనిపించవు. కేవలం కొన్ని తాటిపాకలు మాత్రమే కనిపిస్తాయి. అయితే అటుగా వెళుతున్న ఒక విద్యార్థిని అడగటం వల్ల గోపాలరావుకి కొత్త ఇంజనీరింగ్ కాలేజీ యొక్క అసలు భాగోతం తెలుస్తుంది. అలాగే కాలేజీ పేరుతో జరుగుతున్న మోసం, దోపిడీ కూడా గోపాలరావుకి బాగా అర్థం అవుతుంది. అదే సమయంలో అక్కడికి లారీలో వచ్చిన సంచార పరిశోధనాలయం (లేబొరేటరీ) యొక్క బండారం కూడా బట్టబయలు అవుతుంది.

సంచార పరిశోధనాలయం ముందు మూగిన విద్యార్థులు మూడు రకాల టికెట్లను కొనుగోలు చేయడం చూసి, వాటిలోని మర్మం ఏమిటో తెలుసుకోవాలని ప్రశ్నించిన గోపాలరావుకి, సిద్ధయ్యవాటి యొక్క అంతరార్థాన్ని గురించి వివరించిన తీరు ఈ కథలో గొప్ప మలుపు అని చెప్పవచ్చు. సంచార పరిశోధనాలయం వచ్చిన తర్వాత ఆ కొత్త కాలేజీ ప్రిన్సిపాలు ద్వారా సిద్ధయ్య తెలుసుకున్న విశేషాలు ఇవి.

కొత్తగా ప్రారంభించిన ఇంజనీరింగ్ కాలేజీలకు సకాలంలో లేబొరేటరీ ఎక్విప్‌మెంట్స్ అందించలేని సంస్థ ఏర్పాటు చేసిన ఒక వెసులుబాటు పద్ధతి ఈ సంచార పరిశోధనాలయం. ఇందులో కొత్త కాలేజీల విద్యార్థులకు విద్యార్థులకి మూడు ఆప్షన్స్ ఇచ్చారు.

ఒకటి: చెయ్యాల్సిన ఎనిమిది ప్రయోగాలకి ప్రశ్నోత్తరాలలాగా తయారుచేసిన సైక్లోస్టైల్డ్ నోట్సు కొనుక్కోడం ఒకటి. దాన్ని అష్టోత్తరం అంటారు. ఆ నోట్సు దగ్గర పెట్టుకొని తోమాలసేవ టిక్కెట్లు కొనుక్కున్న విద్యార్థులు ప్రయోగం చేస్తుండగా పక్కన నిలబడి "అదిగో బొమ్మలో చూపించిన ఎనిమిదో నంబర్ నాబ్. దాన్ని కుడివైపుకి తిప్పి ఎడం కన్నుతో ఆ లెన్సులోంచి చూడాలి" అని చెప్పుకొంటూ వాచ్ చేస్తారు ఈ టిక్కెట్లు కొనుక్కున్న వాళ్ళు. దీని ధర తక్కువ.

రెండు: ప్రతీ ఎక్స్‌పెరిమెంటూ సొంత చేత్తో చేసుకొని చూసుకొనే ఆప్షన్. దీని ధర ముందు దానికంటే హెచ్చు అయితే ప్రయోగం అయ్యాక ఎవరి పరికరాలు వాళ్ళే తోమి శుభపరిచిపోవాలి. ఆ ప్రొప్రైటర్ "మీరా యాపరేటస్ మర్చిపోకుండా తోమాల" అని చెప్తాడని దీనికి తోమాల సేవన్న పేరు పెట్టారు.

మూడు: అన్నింటిలోకి ఉత్తమమైన ఆప్షన్ కల్యాణం. ఇది విద్యార్థుల కల్యాణం నిమిత్తం ఏర్పాటైంది. ఈ టిక్కెట్టు కొన్నవాళ్లకి కంపెనీ యే ఎక్స్‌పెరిమెంట్లు ఎలా చెయ్యాలో చేసి చూపిస్తుంది. రాసిన రికార్డులను రెడీమేడ్‌గా ఇస్తారు. కేండిడేటు దానిమీద తన పేరు రాస్తే చాలు. పరిశోధనలో ఎగ్జామినర్ తల తిప్పినప్పుడు రీడింగ్స్ తీసి పెడ్తారు. కాల్క్యులేషన్స్ చేసి పెడ్తారు. కేండిడేటు పేపరుమీద తనకి తోచింది రాస్తే చాలు. అది కంపెనీ వాళ్ళు కొట్టేసి సరైన జవాబులు రాస్తారు. అయితే కేండిడేటు మాత్రం పేపరు మీద కరెక్టుగా నెంబరు వేయాలి. అది చేస్తే ఇంక కళ్యాణం టిక్కెట్లు కొన్న విద్యార్థి పాస్ అవడం గారింటీ అతనికి ఈ పద్ధతి కల్యాణప్రదం.

**ముగింపు:**

డొనేషన్ల మీది ఆశతో కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల దుస్థితిని ఈ కథ మన ముందు ఉంచుతుంది. ఆధునిక నాగరికత, ప్రపంచీకరణ, శాస్త్రసాంకేతిక రంగాలలో వెల్లువెత్తిన వినూత్నమైన ఆవిష్కరణలు ఎన్ని జరిగినప్పటికీ, నలభై ఏళ్లకు ముందు ప్రైవేటు కాలేజీల పరిస్థితి ఏవిధంగా ఉన్నదో ఇప్పటికి కూడా అలాగే ఉన్నది. ఇంకా చెప్పాలంటే ఇంకా అధ్వాన్నంగా తయారైందని కూడా చెప్పవచ్చు. ఇక్కడ లేమితనం కేవలం లేబొరేటరీ ఎక్విప్‌మెంట్స్ గురించి మాత్రమే కాదు. బోధన వంటి మిగతా అన్ని విషయాలలో కూడా ఈ లేమితనం ప్రస్తుతం విపరీతంగా కనిపిస్తున్నది.

ఈ కథలో సిద్ధయ్య చెప్పినట్లుగా, ఊరుకో ఇంజనీరింగ్ కాలేజీ పెట్టడానికి పర్మిషన్ తెచ్చుకోవడం కష్టమేమికాదు. దానికి సులువైన మార్గాలు ఎన్నో ఏర్పడ్డాయి. ఎవర్నెప్పుడు ఎక్కడ ఎలా చూడాలనేది అనుభవం ఉన్నవాళ్లనెవరిని అడిగినా చెప్తారు. కాకపోతే కాలేజీ బిల్డింగ్స్ కట్టుకోడానికి సిమెంటు దొరకదు. స్కిల్డ్ లేబర్, తాపీ మేస్త్రీలు దొరకరు. పాకలైతే విద్యార్థుల చేతనో, సీటు అడగటానికి వచ్చిన తండ్రులచేతనో వేయించవచ్చు. కాని లేబొరేటరీలు పెట్టాలంటే కుదరదు. కాలేజీలు కుక్క గొడుగుల్లా మొలుచుకొని వస్తున్నాయి కదా అని సైంటిఫిక్ ఎక్విప్మెంట్మాను ఫాక్చర్చేసే కంపెనీలు పోటీపడి అదే రేట్లో పుట్టుకురావు కదా? అనే మాటల్లో ఎంతో వాస్తవికత మనకు కనిపిస్తుంది. ఈ అంశమే ఈ కథకు సార్వజనీనతను కలిగిస్తున్నదని చెప్పవచ్చు.

## ప్రస్తావనలు:

౧. కవన, శర్మ। *సంచార పరిశోధనాలయం*, ఆంధ్రపత్రిక, 8-10-1982
౨. కృష్ణమూర్తి, ఇరివెంటి। *తెలుగు కథా రచయితలు*, హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1982
౩. దక్షిణామూర్తి, పోరంకి. *కథానిక స్వరూపస్వభావాలు*, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1988
౪. రాజారాం, మధురాంతకం। *తెలుగు కథకులు ( కథన రీతులు*। హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1998
౫. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. *కథా శిల్పం*, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995
౬. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. *నవలా శిల్పం*, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995